క్లుప్తంగా...

రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 53వ జన్మదిన వేడుకలు కంటోన్మెంట్‌లో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా బొల్లారం జనరల్ హస్పిటల్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్యారసాని రామ్‌కుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. బద్దం బల్వంత్‌రెడ్డి, రాజిరెడ్డి, మురళి, ఎస్. రవి, వెంకటేష్, లోకేష్, చైతన్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సహకారం అందిస్తా

కంటోన్మెంట్: పేద విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె కృశాంక్ అన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో నియోజకవర్గ పరిధిలోని 19 ప్రభుత్వ పాఠశాలల్లోని 6,500 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం పికెట్ ప్రభుత్వ పాఠశాలలో 260 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా 'గిఫ్ట్ ఎ స్మైల్' పేరిట ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ ప్రారంభించామన్నారు.

నేడు జనరల్‌బజార్ జగన్నాథ స్వామి రథయాత్ర

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ జనరల్‌బజార్‌లోని జగన్నాథ స్వామి రథయాత్రను మంగళవారం నిర్వహిస్తున్నామని జగన్నాథస్వామి రాంగోపాల్ ట్రస్ట్ ఫౌండర్ ఫ్యామిలీ ట్రస్టీ పురుషోత్తం మలానీ ఒక ప్రకటనలో తెలిపారు. గత 130 ఏళ్లుగా జనరల్‌బజార్‌లోని జగన్నాథ స్వామి రథయాత్రను పూరిలో జరిగే రథయాత్రతో పాటు జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్ర దేవిలతో ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 6.15 గంటలకు భక్తులు దర్శనం చేసికునేందుకు దేవాలయంలోకి అనుమతిస్తామని, మధ్యాహ్నం 1గంటకు సాదారణ భక్తుల దర్శనం ముగుస్తుందని తెలిపారు. దేవాలయం నుంచి సాయంత్రం 4గంటలకు రథయాత్ర ప్రారంభమై ఎంజీరోడ్డు, రాణిగంజ్, హిల్‌స్ట్రీట్ గుండా కొనసాగి మరుసటి రోజు తెల్లవారు జామున 4గంటలకు దేవాలయానికి తిరిగి చేరుకుంటుందని వివరించారు.

చిత్తనూర్ రైతులకు అండగా ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: నారాయణపేట్ జిల్లా, మరికల్ మంగలం, చిత్తనూర్ రైతులు ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేస్తున్న పోరాటానికి ఓయూ విద్యార్థులు, అధ్యాపకులు పేర్కొన్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో చిత్తనూర్ ఇంథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిద్దాం, బాధిత గ్రామస్తుల పోరాటానికి అండగా నిలుద్దాం అనే అంశం పై ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. పంటలు పండే భూములలో రసాయాన పరిశ్రమల వలన ఏర్పడు కాలూష్యం, జీవరాసులకు కలిగే అనార్థల పై వక్తలు మాట్లాడారు. ఓయూ అధ్యాపకులు, విద్యార్థులతో పాటు ఐఐసీటీ విశ్రాంత శాస్త్రవేత్త బాబూరావు, పర్యావరణవేత్త దొంతి నాగేశ్వర్‌రావు, రైతు స్వరాజ్యా వేదిక నాయకులు కన్నెగంటి రవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఎల్లమ్మ ఆలయంలో 'మర్రి'పూజలు

అమీర్‌పేట: సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు నరేందర్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓయూ పోలీస్ స్టేషన్ ఎదుట ఏబీవీపీ ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థి నాయకుల పై దాడి చేసిన ఓయూ భూముల కబ్జా దారులను అరెస్ట్ చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఏబీవీపీ ఓయూ అధ్యక్షకార్యదర్శులు సిలివేరు అశోక్, బట్టు పరుశురామ్ మాట్లాడుతూ ఈ నెల 15న హబ్సిగూడ వైపు ఓయూ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం పనులను అడ్డుకున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వికాస్‌తో పాటు మరికొందరి పై కబ్జాదారులు మరణాయుధాలతో తీవ్రంగా గాయపరిచిన అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిలో అధికార పార్టీ నేతల హస్తం ఉన్నందున వారిని అరెస్ట్ చేయకుండ కాపాడేందుకు ప్రయత్నిస్తున్న ఓయూ అధికారులు, పోలీసులపై మండిపడ్డారు.

డ్రగ్స్ నిర్మూలనలో మేమూ భాగస్వాములమవుతాం

సనత్‌నగర్: అంతర్జాతీయ డ్రగ్స్ అబ్యూస్ అండ్ ట్రాఫికింగ్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ వంతు బాధ్యతలను నిర్వర్తిస్తామంటూ విద్యార్థులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అలాగే పోస్టర్ తయారీ, నినాదాలు రాయడం వంటి అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు చెందిన ఎస్‌పీలు సునీతారెడ్డి, చక్రవర్తి అవగాహన కల్పించారు.

చూడచక్కగా పార్కుల అభివృద్ధి


పార్కును ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రకృతిని తలపించేలా పచ్చదనం.... మనస్సును ఆహ్లాదపరిచే వాతావరణం...జిమ్ వంటి సౌకర్యాలు, సదుపాయాలతో పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో చిదానందం కాలనీలో సోమవారం నూతన పార్కును మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పద్మారావునగర్ పరిసర ప్రాంతాలకు చెందిన అపార్టుమెంట్స్, కాలనీ వాసుల సౌకర్యం కోసం లక్షలాది రూపాయల వ్యయంతో పార్కులను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గతంలో ఎన్నడూలేని విధంగా పద్మారావునగర్‌లో అనేక ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు కోట్లాది రూపాయల ఖర్చుతో పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసినట్లు వివరించారు. ప్రజాభివృద్ధి కార్యక్రమాల పట్ల స్థానికులు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారని స్థానికులు బయటకు వచ్చి తమ సమస్యలను వివరిస్తున్నారని ఇది ఎంతో సంతోషకరమైన పరిణామమన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమీషనర్ లోకేష్‌కుమార్, జోనల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కమీషనర్ ముకుంద రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు బడిలో సకల సదుపాయాలు

గుండా ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వ పాఠశాల ప్రారంభోత్సవం నేడు



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బైబిల్ హౌస్ బన్సీలాల్‌పేట్ సమీపంలోని గుండా ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వ బాలికోన్నత, ప్రాథమిక పాఠశాలలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. రూ. 40లక్షల వ్యయంతో సెకండరీ, ప్రాథమిక పాఠశాలను తీర్చిదిద్దారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ సర్కారు బడిని సకల సదుపాయాలతో అభివృద్ధి చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పాఠశాలను ప్రారంభించడానికి సర్వం సిద్ధం చేశారు.మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ పాఠశాలలను మన బడి-మన బస్తీ కార్యక్రమంలో చేర్చి పాఠశాల సమగ్రాభివృద్ధికి చొరవ చూపారు. మోడ్రన్ పద్ధతిలో విద్యాబోధన...అహ్లాదకరమైన వాతావరణంతో పిల్లలు చక్కగా చదువుకునే విధంగా పాఠశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ బస్తీ పోరు

లాలాపేట: బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు వాగ్దానాలు, మోసపూరిత మాటలతో ఓటర్లను మభ్యపెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిరోజ్ ఖాన్ అన్నారు. ఈ మేరకు సోమవారం సికింద్రాబాద్ నియోజక వర్గం రవీంద్రనగర్‌లో ఆదం సంతోష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బస్తీ పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఫిరోజ్ ఖాన్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ రాములూ నాయక్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ చెప్పేది ఒకటి చేసేది మరొకటని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ అని చెప్పి చిప్ప తెలంగాణ చేశారని ఆరోపించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ బస్తీ పోరు సభలో అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములూ నాయక్, ఫిరోజ్ ఖాన్, సంతోష్

అమ్మవారి హుండీ ఆదాయం రూ.27.36లక్షలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి హుండీ ద్వారా రూ.27,36,259 ఆదాయం లభించింది. సోమవారం దేవాలయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ దేవి, ఈవో మనోహర్‌రెడ్డితో పాటు భక్తులు, రామేశ్వర్, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తుల సమక్షంలో దేవాలయ హుండీని లెక్కించారు. 2 నెలల 18 రోజులకు గాను ఈ ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు.

ఓయూలో అధ్యాపకుల మౌన ప్రదర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో 12 వర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని ఓయూలో మౌన ప్రదర్శనను చేపట్టారు. సోమవారం టీఎస్ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ పిలుపు మేరకు ఓయూ సీటీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ నుంచి పరిపాలన భవనం వరకు మౌనప్రదర్శన చేపట్టారు. సీఎం గతంలో ప్రకటించిన్నట్లు వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మనెంట్ చేసి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. డా.పరుశురామ్, డా.ధర్మతేజా, కోకన్వీనర్లు డా.వేల్పుల కుమార్, డా.వెంకటేశం పాల్గొన్నారు.

ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ

రాంగోపాల్‌పేట్: సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘం హాలులో డైనమిక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జీఆర్ సూర్య రాజ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేపట్టారు. సుమారు రెండు వేల పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

విద్యా సంస్థల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


విద్యాసంస్థల భవన నిర్మాణంపనులు పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలల భవన సముదాయం నిర్మాణం పనులు వేగవంతం చేయాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం భవన నిర్మాణం పనులను ఆయన ఆయన పరిశీలించారు. భవిష్యత్ విద్యా అవసరాలు దృష్టిలో ఉంచుకుని అధునాతన వసతులను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. అనంతరం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిలకలగూడ ఏసీపీ శ్రీనివాస్, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ శంకర్‌తో పద్మారావుగౌడ్ సమావేశమయ్యారు. సీతాఫల్‌మండి, మెట్టుగూడ కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు నిరంతర ఉద్యమాలు

సికింద్రాబాద్: రైల్వే కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతర ఉద్యమాలు చేసేందుకు యూనియన్ సభ్యులంతా సన్నద్ధం కావాలని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.శంకర్‌రావు అన్నారు. సోమవారం ఆర్ఆర్‌బీ ద్వారా కొత్తగా నియమితులైన సికింద్రాబాద్ డివిజన్ ట్రెన్ మేనేజర్ల సమావేశంలో శంకర్‌రావు మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మజ్దూర్ యూనియన్ నాయకులు ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ డివిజన్ కార్యదర్శి రవీందర్, యూనియన్ నాయకులు ఉదయభాస్కర్, వినయప్రసాద్, స్వామి, కరీముల్లా, నరసింహారెడ్డి, కుమార్, యుగంధర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

బౌద్ధనగర్: అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన మేరకు.. వారాసిగూడ ప్రాంతానికి చెందిన సోహెబ్(21) అనే యువకుడు పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి సోమవారం అక్రమంగా తరలించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న సివిల్ సప్‌లై అధికారులు, వారాసిగూడ పోలీసులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యం అక్రమ తరలింపును ఎల్ఎన్ నగర్‌లో అడ్డుకున్నారు. అనంతరం, రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో సివిల్ సప్‌లై ఏసీఎస్ఓ సరస్వతి, ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్‌లు పాల్గొన్నారు.

గడువు తేదీ పొడిగించాలి



అడ్డగుట్ట: బీసీ కులవృత్తి దారులకు ప్రభుత్వం అందజేస్తున్న లక్ష రూపాయల ఆర్థికసాయం దరఖాస్తు గడువును పొడిగించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మారేడుపల్లి మండల తహసీల్దార్ మాధవి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల్లోని కులవృత్తిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సాయం గడువు నేటితో ముగుస్తుండడంతో బీసీ కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయన్నారు. సరైన సమయంలో కుల, ఆదాయ ధృవపత్రాలు రాలేకపోవడంతో చాలా మంది కుల వృత్తి దారులు దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. అందువల్ల దీన్ని దృష్టిలో పెట్టుకొని గడువు తేదీని మరో రెండు వారాల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నేతలు పాకాల యాదగిరి, ఖాజా మియా, గౌరీ నాగరాజు, కాసిం, బాలరాజు, చాంద్ పాషా, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 10 వేల మందితో సామూహిక ధ్యానం

సనత్‌నగర్: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వసుదైక ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది వేల మందితో సామూహిక ధ్యాన, యోగ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగేంద్రం పేరం ఒక ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆయా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి చర్యలు

రసూల్‌పురా: దీర్ఘకాలంగా రసూల్‌పురా ఇందిరమ్మ నగర్ పెద్దరోడ్డులో వర్షపునీరు, పైపులైన్ల లీకేజీల ద్వారా మురుగునీరు, తాగునీరు నిలుస్తూ ఇండ్లల్లోకి చేరుతున్న సమస్య ఎట్టకేలకు పరిష్కారం కానుంది. గతంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, ఇటీవల బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఇంచార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి పర్యటించి సమస్యపై దృష్టి సారించి తగిన విధంగా కృషి చేయాలని బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌ను కోరడంతో సోమవారం కంటోన్మెంట్ బోర్డుకు చెందిన వాటర్ వర్క్స్, శానిటరీ, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు సీఈవో ఆదేశాల మేరకు సమన్వయంతో పర్యటించి సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. వరద నీరు సాఫీగా వెళ్ళేందుకు ప్రత్యేక డ్రేనేజీ లైన్‌తో పాటు గతంలో వేసిన జైకా పైపులైను పూడిక తీసేందుకు నూతనంగా మ్యాన్‌హోల్స్ నిర్మించాలని, అదే విధంగా తాగునీటి పైపులైన్లు లీకేజికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి పనులు ప్రారంభిస్తామని స్థానికులకు హామీచ్చారు.


ఇందిరమ్మనగర్ పెద్దరోడ్డులో సమస్యను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

ఎమ్మార్పీఎస్ జాతీయ సభలు విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

కంటోన్మెంట్: వచ్చే నెలలో హైదరాబాద్ జిల్లా కేంద్రంగా జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా కన్వీనర్ బుషిపాక గణేశ్ అన్నారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఇటుక శ్రీకిషన్ మాదిగ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మూడో వార్డు ఉత్తరయ్య బస్తీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా జులై మూడో వారంలో జాతీయ స్థాయి సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి లక్షలాదిగా హాజరై విజయవంతం చేసి, వర్గీకరణ పోరుకు బలం చేకూర్చాలన్నారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, జిల్లా కన్వీనర్ జంపాల మహేశ్ పాల్గొన్నారు.

నామాలగుండులో ఉచిత రక్త పరీక్షలు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని సన్‌రేస్ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ఈనెల 23 వరకు ఉచిత వైద్య, రక్త పరీక్షలు నిర్వహించనున్నట్టు సికింద్రాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని సోమవారం సన్‌రేస్ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పలువురికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఐదు రోజులపాటు కొనసాగే ఉచిత వైద్యసేవలు, రక్త పరీక్షలను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వైద్య పరీక్షలు అవసమైన వారు 040 27507724 నెంబరుకు ఫోన్ చేసి లేదా నేరుగా డయాగ్నొస్టిక్ సెంటర్‌లో సంప్రదించి అపాయింట్‌మెంట్ తీసుకోవాలన్నారు. ఏపీఎస్ఎస్ జగన్నాథ రావు, మాజీకార్పొరేటర్ ఎంఆర్ శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.


ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు

ఆర్థిక ఇబ్బందులతో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

సికింద్రాబాద్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైలుకింద పడి ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. యాదాద్రి జిల్లా నేమర్‌గుమ్లా గ్రామానికి చెందిన కిరాణం వ్యాపారి ఆంజనేయులు కుమారుడు కుంచారపు సాయికుమార్(23) ఇంజినీరింగ్ చదువుతున్నాడు. చెడువ్యసనాలకు అలవాటు పడిన సాయికుమార్ అప్పులు చేయడం మొదలు పెట్టాడు. అప్పులు తలకుమించిన భారంగా మారడం, ఇచ్చినవారు డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండడంతో సాయి కుమార్ బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య వేగంగా వస్తున్న రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రగాయాలపాలైన సాయికుమార్ మృతదేహం ముక్కలు ముక్కలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టంచేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

రసూల్‌పురా: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి డబుల్ ఇంజన్ సర్కార్‌కు మద్దతు తెలపాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ పేర్కొన్నారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బోర్డు మూడవ వార్డు అంబేద్కర్ నగర్‌లో సోమవారం భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులను రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డు నిధులతో ఎనిమిది వార్డుల్లో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎన్. శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు కనకరాజు, మహిళా మోర్చ నేతలు అనురాధ, స్వరూప, భాగ్యలక్ష్మి, అసెంబ్లీ కన్వీనర్ వినోద, మదన్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల బలోపేతానికి కృషి చేయాండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ వర్సిటీల బలోపేతానికి సీఎం కేసీఆర్ కృషి చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ పేర్కొన్నారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అవినీతి, అసమర్థ వీసీలను నియమించడం వలన వర్సిటీల స్థాయి దిగజారుతుందన్నారు. ఓయూలో భూముల ఆక్రమణలు, తెలంగాణ వర్సిటీలో అవినీతి, అక్రమాలతో పాటు లంచగొండి తనం, కాకతీయ వర్సిటీలో అసమర్థ పాలన, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయానికి ప్రకటించిన రూ.100 కోట్ల బడ్జెట్‌ను ఇవ్వకపోవడం ఇలా అనేక సమస్యలతో వర్సిటీలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వర్సిటీ వీసీతో పాటు ఇతర వర్సిటీలలో అక్రమాలకు పాల్పడుతున్న వీసీల పై హైకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అసమర్థ వీసీల వలన వర్సిటీలకు న్యాక్ గుర్తింపులు రాకపోగా జాతీయ స్థాయి ర్యాంకులు దారుణంగా పడిపోతున్నాయన్నారు. ఏబీవీపీ సిటీ సెక్రెటరీ శ్రీకాంత్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్, సురేష్, పృథ్వీతేజ, జిల్లా కన్వీనర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

సౌందర్య కుటుంబీకులను పరామర్శించిన నాయకులు

పద్మారావునగర్: జీవై కంపౌండ్‌లో ఇద్దరు పిల్లలతో సహా బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సౌందర్య కుటుంబాన్ని సోమవారం సాయంత్రం టీటీడీపీ నాయకులు పరామర్శించారు. గాంధీనగర్ పోలీసు స్టేషన్‌లో ఉన్న సౌందర్య తల్లి దుర్గను కుటుంబ సభ్యులను టీటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, రాజులు పరామర్శించారు. సౌందర్య కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.


బేగంపేటలో హరితహారం కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి..


సనత్‌నగర్‌లో.. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి...


మెగా డెయిరీలో .. చైర్మెన్ సోమ భరత్‌కుమార్


మార్కండేయనగర్ హరితోత్సవంలో..

ఉత్సాహంగా హరితహారం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో సోమవారం హరితహారం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మొక్కల మనుగడతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. హరితహారం కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు.


మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్


తార్నాకలో.. డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత శోభన్‌రెడ్డి


జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కంది శైలజ


నెహ్రూ నగర్ పార్కులో నిర్మించిన షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి తలసాని